ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 14 ఫిబ్రవరి 2024



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మేమొచ్చాక వంశధార నిర్వాసితులకు

మెరుగైన ప్యాకేజీ

- తొలి రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- పాతపట్నం ఎమ్మెల్యే ఒక్క రోడ్డు కూడా వేయలేదు
- ఇసుకతో డబ్బులు దోచుకుంటున్నారు
- 'శంఖారావం'లో నిప్పులు చెరిగిన లోకేశ్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు



మాట్లాడుతున్న నారా లోకేశ్



హాజరైన టీడీపీ, జనసేన శ్రేణులు, ప్రజలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన శంఖారావం యాత్ర విజయవంతమైంది. మూడో రోజు మంగళవారం పాతపట్నంలో జరిగిన లోకేశ్ సభకు భారీ సంఖ్యలో టీడీపీ-జనసేన శ్రేణులు, ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. సమష్టిగా పనిచేసి సైకో సీఎంను తరిమికొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. వంశధార నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, తొలి రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని, జిల్లాకు ఐటీడీఏను తీసుకొస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

శ్రీకాకుళం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి)



కార్యకర్తల ఉత్సాహం

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి: ఎంపీ

మెళియాపుట్టి/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం తనకు తల్లి లాంటిదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. 'వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. వైసీపీ అరచకపాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. టీడీపీ హయాంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, పింఛన్లు, పెళ్లి కానుక, చంద్రబీమా వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రానికి ఐటీ కంపెనీలు తెచ్చి యువతకు ఉద్యోగాలు ఇచ్చాం. ఏ కష్టమొచ్చి నా మీ వెంట టీడీపీ ఉంటుంది. వంశధార నిర్వాసితులకు రూ.431 కోట్లు యూత్ ప్యాకేజి ఇచ్చిన ఘనత టీడీపీదే. పాతపట్నం రైల్వే స్టేషన్‌లో రాజారాణి రైలు నిలపటానికి పోరాటం చేస్తా. జిల్లా సమస్యలపై నిత్యం పోరాడుతా'నని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

కేవలం రెండు మాసాల్లో ఎన్నికలు రానున్నాయి. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం స్థాపించాక వంశధార నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తా'మని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. మూడో రోజు మంగళవారం పాతపట్నం నియోజకవర్గంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు పాతపట్నం నియోజకవర్గాన్ని రూ.1400 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

'వంశధార-నాగావళి అనుసంధానం చేసేందుకు చంద్రబాబునాయుడు కృషిచేశారు. డబ్బై శాతం పనులు పూర్తయ్యాయి. రోడ్లు, పాఠశాలలు, ఎన్టీఆర్ సుజల ధార, కిడ్నీ రోగులకు డయాలిసిస్ సెంటర్లు.. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు పూర్తిచేశాం. మరో ఐదింటిని ప్రారంభిస్తే ఇప్పుడు వాటిని నిలిపివేశారు. టీడీపీ హయాంలో పది వేల ఇళ్లను నిర్మించి ఇచ్చాం. వంశధార నిర్వాసితులకు రూ. 420 కోట్లు ఇచ్చాం. ఏకలవ్య పాఠశాలు, చేనేత భవనాలు, కమ్యూనిటీ భవనాలను నిర్మించాం. గిరిజన తండాలకు సోలార్ ప్లాంట్లను నేను మంత్రిగా ఉన్నప్పుడు మంజూరుచేశా. ఇంతచేసినా 2019లో ఓడిపోయాం. టీడీపీ చేసిన అభివృద్ధి కంటే వైసీపీ అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లాయి. అందుకే ఈ రెండు మాసాలు ప్రతి టీడీపీ, జనసేన కార్యకర్త గడప గడపకు వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాలను ప్రజలకు వివరించాలి. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అనుభవమున్న వ్యక్తని నేను భావించా. కానీ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. కనీసం ఒక్క రోడ్డు కూడా వేసుకోలేకపోయారు. ఒక్క ప్రాజెక్టు తేలేకపోయారు. నియోజకవర్గానికి వైసీపీ హయాంలో ఏం మేలు చేశారో చర్చకు సిద్ధమా?. దర్జాగా ఇసుకను దోచుకుంటున్నారు. చివరకు పాఠశాల స్థలాన్ని కూడా కొట్టేయాలని చూస్తున్నారు. ఏ పని కోసమైనా వాటాలు కావాలని ఎమ్మెల్యే అడుగు తుంటారు. గ్రామాల్లో కాంట్రాక్టు పనులు కూడా ఎమ్మెల్యేనే చేయించుకుంటున్నారు. అంగన్వాడీ, ఆశ వర్కర్లు, షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులు కూడా ఎమ్మెల్యే అమ్మేసుకున్నారు. ఇక్కడ సభ సాక్షిగా చెబుతున్నా..



వేదికపై లోకేశ్‌తో టీడీపీ-జనసేన శ్రేణులు

వంశధార నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ చెల్లిస్తాం. ఇప్పటికే చంద్రబాబు ఈ విషయాన్ని ప్రజల మధ్యనే చెప్పేశారు. వైసీపీ తన్నే దున్నపోతు అయితే పాలిచ్చే ఆవు టీడీపీ అన్నది ప్రజలు గుర్తించుకోవాలి. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే తొలి రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తాం. జిల్లాకు ఐటీడీఏను తీసుకువస్తాం. పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రిని పూర్తిచేసే బాధ్యత నేను తీసుకుంటా. టీడీపీ-జనసేన శ్రేణులు సమష్టిగా పనిచేసి.. వైసీపీని ఇంటికి పంపాలి. సైకో సీఎం జగన్మోహన్‌రెడ్డిని తరిమికొట్టాలి. అధికార పార్టీ కేసులు పెట్టినంతమాత్రాన ఎవరూ భయపడొద్దు. అవేవీ మనల్ని ఏమీచేయలేవు. కార్యకర్తల్లో ఎవరిపైన ఎక్కువ కేసులు నమోదవుతాయో వారికే నామినేటెడ్ పదవులు ఇస్తాం.' అని లోకేశ్ భరోసా ఇచ్చారు. అనంతరం పాతపట్టణం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రతిజ్ఞ పత్రం చదవగా.. అందరూ గుండెపై చేయివేసుకుని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, జనసేన జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చైతన్య టీడీపీ నాయకులు మామిడి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు

- నమ్మిన కార్యకర్తలకు ప్రాణం పెడతాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టెక్కలి, ఫిబ్రవరి 13: 'వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. జగన్ పాలనపై ఏ వర్గం కూడా సంతృప్తిగా లేదు. ఆ పార్టీకి ఇవే చివరి ఎన్నికలు.' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'వైసీపీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు చాలా మంది నాతో టచ్‌లో ఉన్నారు. టీడీపీలో ఎవరు చేరాలన్నా గేట్లు తెరిచే ఉంచుతాం. ఎన్నికలు తరువాత గేట్లు మూసివేస్తాం. నమ్ముకున్న కార్యకర్తలకు నేను ప్రాణం పెడతా. వారి కోసం వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. కార్యకర్తలు మనస్పర్థలు వీడి కలిసి పనిచేయాలి. టెక్కలిలో నేను చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో గెలిపించడంతో పాటు భారీ మెజార్టీ బహుమతిగా ఇవ్వాలి. సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. టీడీపీ, జనసేన విజయం ఖాయమ'ని తెలిపారు. టెక్కలి మండలం గూడేం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బీఎస్ఎఫ్ జవాన్ పిట్ట రాము కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టీడీపీలోకి భారీగా చేరికలు..

సంతబొమ్మాళి: మండలంలోని కోటపాడు, ఆర్.సున్నాపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కోటపాడు పంచాయతీ రెండో వార్డు మెంబరు చాట్ల లోకేశ్వరరావుతో పాటు కార్యకర్తలు ఎ.వసంతరావు, ఐ.శాంతారావు, ఎల్.కాంతారావు, ఎన్.ఆదినారాయణ, లింగూడు పంచాయతీ పదో వార్డు నెంబరు ఆర్.సున్నాపల్లికి చెందిన బొంగు సూర్యారావు, పైల ఢిల్లేశ్వరరావు, బొంగు భరత్‌రెడ్డి, మేఘవరం చలపతిరావు, పైల కృష్ణారావు, బొంగు గన్నేరు, బొంగు ఆదినారాయణ, గిన్ని శంకర్, బొంగు లక్ష్మణరావు, పైల సింహాచలం, హరిప్రసాద్, నక్క దుర్గారావు, బొంగు బాయిరెడ్డి, పరపటి చిరంజీవులు, ఏదూరు ధర్మారావు తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్, కోటపాడు మాజీ సర్పంచ్ చాట్ల అప్పలి పాల్గొన్నారు.

కనిపిస్తే కాటేస్తున్నాయి

- శ్రీకాకుళంలో కుక్కల స్వైర విహారం
- హడలిపోతున్న నగర వాసులు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 13: నగరంలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి కాటేస్తున్నాయి. దీంతో నగర ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. బలగ మెట్టు, ఇలిసిపురం, హడ్కోకాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, గూనపాలెం, దమ్మలవీధి, నానుబాల వీధి, అరసవల్లి, విశాఖ-ఏ కాలనీ, తదితర ప్రాంతాల్లో కుక్కలు రోడ్లపై సంచరిస్తూ చిన్న పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా దాడులు చేస్తున్నాయి. ఈ నెల 10న బలగ మెట్టులో నివశిస్తున్న ఎస్. తేజేశ్వరి స్కూల్ నుంచి సాయంత్రం ఇంటికి వస్తుండగా కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారి పెదాలపై పెద్ద గాటు పడడంతో కుటుంబ సభ్యులు జెమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇటువంటి ఘటనలు నగరంలో కోకొల్లలు. దీనిపై నగరపాలక, శానిటరీ సిబ్బందికి పలు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేలల్లో కుక్కలు.. పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధి కుక్కలను నివారించేందుకు నగరపాలక సంస్థ అధికారులు స్థానిక ఖాజీపేటలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడకు ప్రతిరోజూ 10 నుంచి 15 వీధి కుక్కలను తీసుకొచ్చి, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. నాలుగు రోజుల తర్వాత యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసి ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అదే ప్రాంతంలో కుక్కలను విడిచిపెడుతున్నారు. గతేడాది వెయ్యి ఆపరేషన్‌లు చేశారు. కానీ, 2500 ఆపరేషన్‌లు చేసినట్లు చెప్పి బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది కొత్త వారికి ఏబీసీ సెంటర్‌ను అప్పగించారు. కాగా, నగరంలో వీధి కుక్కలు వేల సంఖ్యలో ఉన్నాయని, కానీ రోజుకు పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు చేస్తే వాటి బెడద ఎప్పటికి తీరుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కుక్కల దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



రోడ్డుపై గుంపులుగా కుక్కలు



ఏబీసీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

చర్యలు తీసుకుంటాం..

ఖాజీపేటలోని ఏబీసీ సెంటర్‌ను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. నాలుగు నెలల క్రితం స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సల నిర్వహణను అప్పగించారు. దీంతో సొసైటీ పని తీరును కమిషనర్ పరిశీలించారు. కుక్కలను అధిక సంఖ్యలో పట్టుకుని ఆపరేషన్లు నిర్వహించాలని, అదే సమయంలో వాటి భద్రతపై కూడా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కాగా, నగరంలో కుక్కల దాడుల విషయమై కమిషనర్ వద్ద ప్రస్తావించగా.. వాటి నియంత్రణలో భాగంగానే ఏబీసీని సందర్శించామని, పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గిరిజన నిరుద్యోగులకు నిరాశే

- డీఎస్సీలో అరకొరగా పోస్టుల కేటాయింపు



- మెళియాపుట్టి మండలం హీరాపురం గ్రామానికి చెందిన తంప సరిత నాలుగేళ్ల కిందట బీఈడీ పూర్తిచేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ పడుతుందనే ఉద్దేశంతో విజయనగరంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటోంది. అయితే ప్రస్తుతం డీఎస్సీలో గిరిజనులకు కేటాయించిన పోస్టులు చూసి నిరాశ చెందుతోంది.



- మెళియాపుట్టి మండలం ముఖందపురానికి చెందిన అసర మాధవరావు అనే గిరిజన యువకుడు బీఈడీ చేసి.. ప్రస్తుతం గ్రామ వలంటీరుగా పని చేస్తున్నాడు. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌లో అధికంగా పోస్టులు కేటాయిస్తుందని ఆశ పడ్డారు. తీరా నోటిఫికేషన్ చూసి నిరాశ చెందుతున్నాడు.



(మెళియాపుట్టి)

జిల్లాలో చాలా మంది నిరుద్యోగులు.. డీఎస్సీ నోటిఫికేషన్‌పై పెదవి విరుస్తున్నారు. జిల్లాకు 101 పోస్టులు మాత్రమే కేటాయించడంతో ఆందోళన చెందుతున్నారు. టీడీపీ హయాంలో గిరిజన నిరుద్యోగులకు వైటీసీల ద్వారా శిక్షణ ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రభుత్వం అధికంగా పోస్టులు కేటాయిస్తుందని ఆశ పడ్డారు. కానీ తమ ఆశలన్నీ అడియాశలయ్యాయని గిరిజన నిరుద్యోగులు వాపోతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సుమారు 70వేల మంది బీఈడీ, డీఎడ్ చేసిన వారు ఉన్నారు. కాగా జిల్లాకు అరకొరగానే పోస్టులు కేటాయించడంతో.. తీవ్ర పోటీ నడుమ తమకు ఉద్యోగాలు వస్తాయనే ఆశ లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో పోస్టులకు సంబంధించి ఖాళీలకు తగ్గట్టు నోటిఫికేషన్ విడుదల చేయలేదని వాపోతున్నారు.



ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న గిరిజన యువత

మూడో రోజూ శంఖారావం విజయవంతం

● పాతపట్నంలో లోకేశ్‌కు ఘన స్వాగతం ● వినతులు స్వీకరించి.. పరిష్కారానికి హామీ ఇచ్చి..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర జిల్లాలో మూడో రోజు మంగళవారం విజయవంతమైంది. పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో శంఖారావం బహిరంగ సభ నిర్వహించగా టీడీపీ కేడర్‌తో పాటు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నేతల ప్రసంగాలు ఇలా...

పాతపట్నం/మెళియాపుట్టి



మహిళలు, యువతతో కరచాలనం చేస్తున్న లోకేశ్

రెడ్డమ్మ ఢిల్లీకి.. జగన్ జైలుకి



రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తరువాత సీఎం జగన్ జైలుకి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఢిల్లీకి వెళ్లిపోవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. పాతపట్నంలో మంగళవారం జరిగిన శంఖారావం సభలో మాట్లాడుతూ.. గడచిన 40 ఏళ్లుగా మా కుటుంబాన్ని ఆదరిస్తున్న కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. వంశధార నిర్వాసి తులను సీఎం జగన్ అన్నివిధాలా మోసం చేశారన్నారు. 2013 భూసేక రణ చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి దానిని గాలికి వదిలేశారని విమర్శించారు. పాలి టెక్నిక్ కళాశాల, ఐటీడీఏ మంజూరు చేయాల న్నారు. వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి నిల్.. అవినీతి ఫుల్ అని అన్నారు.

కార్మికుల పొట్ట కొట్టారు



పాతపట్నం ఎమ్మెల్యే పేరులో మాత్రమే శాంతి ఉంది. ప్రజలకు మాత్రం శాంతి లేదు. జాబ్ కాలెండర్ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. ఇసుక లభ్యం కాక 50 లక్షల మంది కార్మికుల పొట్ట కొట్టారు. శంఖారావం సభ సాక్షిగా చెబుతున్నా.. మేమంతా జగన్‌ను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం. అందరం కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి పాటుపడతాం. యువ గళం పాదయాత్రలో లోకేశ్ యువతను చైతన్యం చేయడం శుభపరిణామం.

-గేదెల చైతన్య, నియోజకవర్గ ఇన్‌చార్జి, పాతపట్నం



టీడీపీ కార్యకర్తల ప్రతిజ్ఞ

వృద్ధుడి అభిమానం







వినతులు స్వీకరిస్తున్న లోకేశ్

సమస్యలపై వినతులు

● వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వాసిత గ్రామాల్లోని టీడీపీ యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు బర్రి సురేష్, బొడ్డిన ధర్మారావు, పొడ్డిన శాంతారావు, గవర గోవింద రావు తదితరులు కోరారు.

● టీడీపీ అధికారంలో వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు డీఎస్సీ ప్రకటించాలని నిరుద్యోగులు కోరారు.

● ఆర్జీయూకేటీ కాంట్రాక్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలని, మినిమం స్కేల్ వర్తింపజేయాలని ఆ సంఘం నేతలు కోరారు. ● సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు.

● కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘ నేతలు వినతిపత్రం అందించారు.

● వంశధార నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి న్యాయం చేయాలని, పునరావాస కాలనీల్లో సదుపాయాలు కల్పించాలని వంశధార నిర్వాసితులు వినతిపత్రం అందిం చారు.

● గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నేతలు కోరారు. వీటిని పరిశీలించిన లోకేశ్ పరిశీలించి ప్రభుత్వం వచ్చిన తరువాత న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



టీడీపీ అభిమాని, దివ్యాంగ యువకుడితో మాట్లాడుతున్న నారా లోకేశ్

శంఖారావానికి భారీ ర్యాలీ



కార్యకర్తలు, అభిమానులతో వస్తున్న ఎంజీఆర్

పాతపట్నం: పాతపట్నంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించిన శంఖారావం యాత్రకు టీడీపీ సీనియర్ నాయకుడు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. పాతపట్నంలోని తన కార్యాలయం నుంచి బహిరంగ సభాస్థలానికి వేలాది మంది అభిమానులతో వెళ్లారు. అనంతరం జనసేన, టీడీపీ ముఖ్య నాయకులతో కలిసి సభా వేదికపైకి వెళ్లిన ఎంజీఆర్ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: బగ్గు



గుండువలసలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ సీఎంగా వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం గుగ్గిలి పంచాయతీ గుండవలస గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు టీడీపీ పెద్ద పీట వేస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు టీడీపీ భరోసా ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నేతలు దుంగ స్వామిబాబు, బగ్గు సునీల్, పంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ



రుంకు హనుమంతుపురంలో పల్లె పల్లెకు టీడీపీ నిర్వహిస్తున్న నేతలు

సంతబొమ్మాళి: అభివృద్ధికి చిరునామా టీడీపీ అని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం రుంకు హనుమంతుపురంలో పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీ సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వజ్జ ప్రభాకర్, బుచ్చ మురళీకృష్ణ, పోలాకి కృష్ణమూర్తి, ఎన్ని డిల్లేశ్వరరావు, కూశెట్టి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంకాదా?





నేలపై వేలాడుతున్న విద్యుత్ సర్వీసు వైర్లు

చిత్రాలను చూస్తున్నారుగా.. ఇవి హిరమండలం పంచాయతీ చిన్న కోరాడ వీధిలోని విద్యానగర్ లోని దృశ్యాలు.. విద్యుత్ వైర్లు పైనుంచి ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇలా కిందన పడి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు కర్రను స్తంభంగా వినియోగించారు. ఈ కర్ర స్తంభం సోమవారం విరిగిపోయింది. అధికారులకు తెలిపినా స్పందించలేదు. దీంతో రెండు రోజులుగా వైర్లు ఇలా కిందన ఇలా పడి ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

-హిరమండలం

ఇసుక రీచ్‌లపై నిఘా ఉంచాలి: కలెక్టర్



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నరసన్నపేట: ఇసుక రీచ్‌లపై మైన్స్ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ సూచించారు. మంగళవారం గోపాలపెంట ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక రీచ్‌లలో అనుమతులు లేకుండా యంత్రాలతో తవ్వకాలు చేయరాదన్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు పాటించాలని, మైన్స్, రెవెన్యూ అధికారులు ఇసుక ర్యాంపులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ కనకారావు, వీఆర్వోలు అప్పలనాయుడు, శ్యామ్ ప్రసాదరావు, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు

● వాహనాలను అడ్డుకున్న టీడీపీ-జనసేన నేతలు



వాహనదారులతో మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త దుర్గారావు

వజ్రపుకొత్తూరు: బెండి పంచాయతీ మహాదేవపురంలోని పోలినాయుడు చెరువు నుంచి మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్న లారీలను మంగళవారం జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు, స్థానిక టీడీపీ నాయకులు శిష్టు సారధి నాయుడు, కూన మోహనరావు, తమ్మినేని సుధాకర్, కూన షణ్ముఖరావు, బాబురావు అడ్డుకున్నారు. భారీ వాహనాల వల్ల గ్రామాల్లోని రోడ్లు పాడవుతున్నాయని వారన్నారు. మట్టి అక్రమ తరలింపుపై పలాస ఆర్డీవో కార్యాలయం, వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై డీటీ వి.గిరిరాజు వద్ద ప్రస్తావించగా ఫిర్యాదులు అందాయని, ఇప్పటికే సచివాలయం వీఆర్వోలు, వీఆరోఏలను పంపి నట్లు తెలిపారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

పలాస: స్థానిక సీతారామాలయం కాంప్లెక్స్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షర తృతీయ సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి జీజేఎస్ రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ అక్షరా భ్యాసాలు నిర్వహిస్తున్నామన్నారు.

బిల్లుల పెండింగ్

● ముఖం చాటేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

● అభివృద్ధి పనులకు బ్రేక్

పలాస, ఫిబ్రవరి 13: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. బిల్లుల చెల్లింపు బాధ్యత చూడాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ముఖం చాటేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. వివరాలిలా ఉన్నాయి.. మునిసిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో ఒక ఏఈ, ఒక డీఈ మాత్రమే ఉన్నారు. 31 వార్డుల్లో అభివృద్ధి పనులను వీరు పర్యవేక్షించాల్సి ఉంది. ఈనెల 3న ఒకరోజు సెలవుపై వెళ్లిన ఏఈ ఇప్పటి వరకు విధులకు రాలేదు. డీఈ 15 రోజుల పాటు సెలవు పెట్టి వెళ్లిపోయారు. దీనికి ప్రధానంగా వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు చేయకపోవడమే కారణంగా తెలుస్తోంది. కాంట్రాక్టర్లు సైతం తమ బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడం, పాలకులు స్పందించక పోవడంతో ఇంజనీరింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తమకెందుకులే అన్నట్లు వారు సెలవుపై వెళ్లారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బకాయిలతో పాటు కొత్తగా అంచనాలు వేసినవి, పరిపాలన ఆమోదం కోరినవి వందల సంఖ్యలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల చెల్లింపులు లేక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సూదికొండ, నెహ్రూ నగర్, గాంధీనగర్ ప్రాంతా లతో పాటు 31 వార్డుల్లోను అభివృద్ధి పనులకు బ్రేక్ ఏర్పడింది. దీంతో పాలక వర్గంపై తీవ్ర వత్తిళ్లు రావడంతో వారు సైతం చేతులు ఎత్తివేస్తు న్నారు. ఈ పరిస్థితి సాక్షాత్తు మంత్రి అప్పలరాజు నియోజక వర్గంలోని మునిసిపాలిటీలో నెలకొనడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారంపై మునిసి పల్ చైర్మన్ బళ్ల గిరిబాబు వద్ద ప్రస్తావించగా అధికారులు గైర్హాజ రైతే పనులు ఏ విధంగా చేయించగలమని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా తాను ఇప్పటికే సంబం ధిత ఉన్నతాధికారులకు ఈ వ్యవహారాన్ని చెప్పడం జరిగిందన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అధికారులనైనా తాత్కాలికంగా నియమించాలని కోరామని పేర్కొన్నారు.

నిధుల జాప్యంతోనే నెమ్మదిగా పనులు

● ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్



పనులను పరిశీలిస్తున్న ఈఈ సత్యప్రభాకర్

నరసన్నపేట, ఫిబ్రవరి 13: జిల్లాలో వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక ఆసుపత్రి భవ నాల నిర్మాణానికి నిధుల విడుదలలో జాప్యంతో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని వైద్య విధాన పరిషత్ మౌలికాభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఈఈ సత్యప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక వంద పడకల ఆసుపత్రిలో రూ.12.68 కోట్లతో చేపడుతున్న ప్రసూతి, చిన్నపిల్లల వార్డు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. 60శాతం మేరకు పనులు జరిగాయన్నారు. వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. ఫ్లోరింగ్ పనులు సక్రమంగా చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ శిమ్మన్న, ఏఈ వెంకటేష్, ఆసుపత్రి ఏవో ఏబీవీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

టెక్కలి: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న పారిశ్రామిక, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు సంబూరు షణ్ముఖరావు కోరారు. మంగళ వారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోందని విమర్శిం చారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లను అమలు చేస్తోం దన్నా రు. కార్యక్రమంలో సంఘాల నేతలు హెచ్. ఈశ్వరరావు, పాల పోలారావు, సాయి కృష్ణారావు, బెలమర ప్రభాకర్, ఎ.అప్పారావు, బగాది వాసుదేవ రావు, కొల్లి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నమూనా పరీక్షల్లో విజేతలకు బహుమతి ప్రదానం

టెక్కలి: నమూనా జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను మంగళవారం అందించారు. ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సూర్యం ఆధ్వర్యంలో స్థానిక బీఎస్అండ్‌జేఆర్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోత శ్రీనివాస్, అధ్యాపకులు ఎ.బ్రహ్మానందం, ప్రదీప్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధిగా 'తలగాన'



పలాస: పలాస నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధిగా తలగాన నర్సింహమూర్తి నియమితు లయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియమించారని, పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు. తన నియామకానికి సహకరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గౌతు శ్యామ సుందరశివాజీ, ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గౌతు శిరీష, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్, నాయకుడు దువ్వాడ హేమబాబుచౌదరి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జ్ఞాన సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతీ దేవి విగ్రహం, మందిరం ఆవిష్కరణ బుధవారం నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం వై.హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సమస్యలు పరిష్కరించాలంటూ పోస్టుకార్డు ఉద్యమం

సుసరాం(పోలాకి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. సుసరాం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం పోస్టుకార్డులను ప్రదర్శించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోల్లో పెట్టాలని కోరుతూ ఆయా పార్టీల అధ్యక్షులకు లేఖలను పంపామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బరాటం రామారావు, ఎస్.సాయిరాజు, వి.పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా కుంభ సంక్రమణం పూజలు

పలాసరూరల్: పలాస సీతారామాలయ కాంప్లెక్స్‌లోని జగన్నాథ ఆలయంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుంభ సంక్రమణం హోమం, పూజలు నిర్వ హించారు. ప్రతినెలా విశ్వశాంతిని కోరుతూ ఈ హోమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు పండా, రాఘవ, దాసు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

పర్లాకిమిడి: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పర్లాకిమిడి సెంచూరియన్ విద్యార్థులు ప్రతిభ కన బరిచారు. ఈ ఫలితాల్లో సాయిశ్రీనివాస్ 96.4, తనీష పాత్రో 92.5, రాహుల్ గౌడో 85.4, ప్రబీర్ లిమ్మ 85.2, శివబిస్వాల్ 81.5, కె.రాజేంద్ర 78.9 పర్సంటైల్‌తో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యా ర్థులను సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీఎన్ రావు, సెంచూరియన్ పాఠశాల ప్రిన్సిపాల్ సునీతాపాణిగ్రాహి అభినందించారు.

ఒడిశా

వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హైటెక్ విద్యా సంస్థల డైరెక్టర్, బీజేడీ పార్టీ యువనేత రూపేష్ పాణిగ్రాహి అన్నారు. హైటెక్ ప్లాజాలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గుండె పరీక్షలు, బీపీ, సుగర్, కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, అధ్యక్షురాలు సునేమిమండల పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఒడిశా ధాన్యం దిగుమతి

- మిల్లర్లకు కాసులు కురిపిస్తున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం
- ఇదీ సరుబుజ్జిలి మండలంలో పరిస్థితి

సరుబుజ్జిలి: ఒడిశా ధాన్యం యథేచ్ఛగా దిగుమతి అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒడిశాకు ఆనుకుని సరుబుజ్జిలి మండలం ఉండడం, అక్కడ గిట్టుబాటు లేకపోవడంతో యథేచ్ఛగా దిగుమత వుతున్నాయి. ఆ ధాన్యం మిల్లర్లు కాసులు కురిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆరుగాలం కష్టపడిన రైతులకు అవస్థలు తప్పడంలేదు. సరుబుజ్జిలి మండలంలో 12,500 ఎకరాల్లో పండిన సుమారు 2.50 లక్షల ధాన్యం బస్తాలు వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు సేకరించాల్సిఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడుతోంది. ఇక్కడ సేకరించిన ధాన్యం శ్రీకాకుళం, గార, సారవకోట, ఆమదాలవలస మండలాలకు చెందిన రైస్‌మిల్లులకు విక్రయ అనుమతులు ఇస్తున్నారు. ఈ విధానమే రైతుల పాలిట శాపంగా మారింది. రైస్‌మిల్లర్ల పాలిట వరంగా మారింది. ఇప్పటి వరకు మండలంలో రెండు లక్షల ధాన్యం బస్తాలు సేకరించినట్లు అధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇంకా మండలంలోని పలుచోట్ల పంట పొలాల్లో నూర్చుకాని వరి కుప్పలు భారీ స్థాయిలోఉన్నాయి. దీనికితోడు గోనెసంచుల్లో ఎత్తి కొన్ని చోట్ల నిల్వచేశారు. వీరంతా ధాన్యం తరలింపునకు ఆర్బీకేల నుంచి అనుమతులు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న రైస్‌మిల్లర్లు ఆర్‌బీకే అనుమతులు లేకుండా రైతుల నుంచి బస్తాకు 200 రూపాయలు తక్కువతో ధాన్యం కొనుగోలు చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఈ విధంగా సేకరించిన ధాన్యాన్ని గోదావరి జిల్లాలకు తరలించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. రైస్‌మిల్లు ల నుంచి పౌరసరఫరాల శాఖ తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి ఒడిశా ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎగుమతులు చేయడం వల్ల మిల్లర్లకు భారీస్థాయిలో కాసులు కురిపిస్తున్నాయని కొంతమంది రైతులు వాపోతున్నారు. కాగా గ్రామాల్లో రైతులు అవగాహన కల్పిస్తున్నామని, ఈనెలాఖరుకు ధాన్యం సేకరణ నిలిపివేస్తాని ఏవో బొడ్డేపల్లి పద్మనాభం ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఒడిశా ధాన్యం దిగుమతిపై తనిఖీలు నిర్వహించి పట్టుపడితే తప్పుచేసిన రైస్‌మిల్లులపై చర్యలకు అధికారులకు నివేదిస్తామని చెప్పారు.



సరుబుజ్జిలి వద్ద పంట పొలంలో అనుమతులు కోసం ఎదురుచూస్తున్న ధాన్యం బస్తాలు

ఐదు మద్యం సీసాలు స్వాధీనం

బూర్జ: మండలంలోని టీఆర్‌రాజుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఐదు మద్యం సీసాలు స్వాధీనంచేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మద్యం సీసాలు తీసుకుని వెళ్తుండగా కొల్లివలస జంక్షన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిమితికి మించి మద్యం సీసాలు విక్రయించినా, ఎవరు వద్ద ఉన్నా చర్యలు తప్పవని ఎస్‌ఐ ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు

పొందూరు: పొందూరు పంచాయతీలో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పాల్పడుతుండడంపై చర్యలు తీసుకుని కబ్జా కాకుండా కాపాడాలని సర్పంచ్ ఆర్.లక్ష్మి కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదుచేశారు. 45ఏళ్ల కిందటసర్వేనంబరు 192లో ఎస్సీకార్పొరేషన్ జిరాయితీ స్థలం కొనుగోలుచేసి కొంతమంది దళితులకు మూడుసెంట్ల చొప్పున ఇళ్లపట్టాలు ఇచ్చిందని లక్ష్మి తెలిపారు.మిగిలిన స్థలాన్ని ఆటస్థలం, కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవ నం నిర్మాణానికి విడిచి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతంఆ స్థలాన్ని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మరోవ్యక్తి ఆక్రమణకు పాల్ప డుతున్నారని తెలిపారు. ఈవిషయంపై ప్రశ్నించిన వీఆర్వో, పంచాయతీకార్యదర్శులను అట్రాసిటీ పేరుతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేసి స్థలాన్ని కబ్జా దారుల నుంచి కాపాడాలని ఫిర్యాదులో కోరారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

మస్తర్లలో కొట్టివేతలు ఉంటే చర్యలు: పీడీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఇచ్ఛాపురం: మస్తర్లలో కొట్టివేతలు ఉంటే క్షేత్రసహాయకునిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం మండలపరిషత్ కార్యాలయంలో గతఏడాది జనవరి 28 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ వరకు మండలంలో ఉపాధిహామీ పథకంలో 1068 పనులపై ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఉపాధి కూలీల వేతనాలు రూ. 9.41 కోట్లు, మెటీరియల్‌కోసం రూ.1.92 కోట్లు, మొత్తం రూ.11.33 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీల వారీగా తనిఖీచేసిన రిపోర్టును చదివి వినిపించారు. పలు పంచాయతీల్లో మస్తర్లలో కొట్టివేతలు ఉన్నట్లు గుర్తించారు. ఇకపై ఇటువంటి తప్పిదాలు చేస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి జాబ్‌కార్డుఉన్న ప్రతిఒక్కరికీ 100 రోజుల పనికల్పించాలని తెలిపారు. పంచాయతీల వారీగా లక్ష్యాలు చేరుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజువారీ సగటు వేతనం కేవలం రూ. 186లు ఉందని దానిని రూ. 250 వచ్చే విధంగా వేతనదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, ఏపీడీ సీహెచ్.శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఆర్పీ దాసు, హెచ్‌ఆర్.మేనేజర్ శ్రావణ్, ఏపీవోలు పి.శ్రీనివాసరావు, కె.భాస్కరరావు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో న్యాయవాదులు 'వంటా-వార్పు'



వంటా-వార్పు కార్యక్రమం నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: పట్టణంలోని కోర్టు ఎదుట మంగళవారం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దుచేయాలని న్యాయవాదులు వంటా-వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయి ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూహక్కు చట్టం జీవో -512న్యాయవాదులకు గొడ్డలిపెట్టుఅని,ప్రభుత్వం వెంటనే జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు, పైడి వరహానరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, గురు గుబిల్లి ప్రభాకరరావు, కిల్లి మార్కెండేయులు, వాడవలస రాజేశ్వరరావు, కూన గణప తిరావు పాల్గొన్నారు.

కమ్మసిగడాం జాతరకు ఏర్పాట్లు



జాతర నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రణస్థలం: కమ్మసిగడాంలో ఈనెల 18 నుంచి మూడురోజులు జరిగే మహాలక్ష్మీతల్లి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్‌ఐ కె.గోవిందరావు జాతర స్థలాన్ని పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు ఎంత మంది భక్తులు వచ్చే అవకాశముందని కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావును అడిగి తెలుసుకు న్నారు. వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా రూట్ మ్యాప్ తయారీచేశారు. జాతరకు వచ్చే భక్తుల వినోదంకోసం పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్‌ఈఆర్ తెలిపారు. కార్య క్రమంలో వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజరవిచంద్ర తేజ, వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి: ఎంపీడీవో

సోంపేట:పంచాయతీల్లో జరుగుతున్న పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో రామారావు, ఎంపీపీ నిమ్మనదాసు కోరారు.మంగళవారం సోంపేటలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరులు, జేఈ రమేష్, ఏవో భాస్కరరావు, హౌసింగ్ ఏఈ శివరాం పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ప్రతిభచూపిన చక్రధర్ కళాశాల విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: జేఈఈ మెయిన్-2024 ఫలితాల్లో చక్రధర్ కళాశాల విద్యార్థులు ప్రతిభచూపారు. ఈ మేరకు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాలచైర్మన్ యాళ్ల చక్రధర్‌రావు తెలిపారు.మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో కేవలం 50 మంది విద్యార్థుల్లో 17 మంది ఎన్‌ఐటీ సీట్లను సాధించారని చక్రధర్‌రావు మీడియాకు వివరించారు. అత్యుత్తమ బోధన కలిగిన అధ్యాపకులతో విద్యార్థులను ఉన్నంతగా తీర్చిదిద్దడంలో తమ కళాశాల విజయం సాధించిందని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యంతోపాటు విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చక్రధర్‌రావు

ఆకలి తీర్చేందుకే 'అన్నక్యాంటీన్లు'

- ఉమ్మడి జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు
- శ్రీకాకుళంలో 300 రోజులుగా నిర్వహణ



అన్నక్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న గొండు శంకర్

అరసవల్లి:తెలుగుదేశం పేదలపార్టీ అని, ప్రతిపేదవాని ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేశామని ఉమ్మడి జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఆ పార్టీ నాయకుడు గొండు శంకర్ తెలిపారు. వైసీపీపాలనలో ఈ క్యాంటీన్లను మూసేశారని ఆరోపించారు. టీడీపీ జాతీయఅధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకుని శ్రీకాకుళంలో గొండుశంకర్ ప్రారంభించిన అన్న క్యాంటీన్ సేవలు 300వ రోజుకుచేరాయి. ఈసందర్భంగా మంగళవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద దివంగత నందమూరి తారకరామారావు, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.చంద్రబాబునాయుడు, నారాలోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని, పేదలఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు మళ్లీ ప్రారంభంకావాలని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా శ్రమించిన చంద్రబా బునాయుడి నేతృత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 300రోజులుగా పేదల ఆకలి తీర్చగలగడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. కేక్‌కట్‌చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమల, రెడ్డిశంకర్, మూకళ్ల శ్రీను, గొండు వెంకట రమణమూర్తి, బగ్గు నలమహారాజు, కంచు దశరథ, బొల్లా నాగేంద్ర యాదవ్, కొయ్యాన జగదీష్, కల్లి యర్రన్నరెడ్డి, డొండపాటి నవీన్‌కుమార్, కొయ్యాన రామ్మోహనరావు, ఎండు చిన్నారావు పాల్గొన్నారు.

ఈదుపురంలో జలయాత్ర



బాహుదా నది జలాలను తీసుకొస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం : ఈదుపురం బెహరా వీధిలో వెలసిన ఉదాస్ గురు ప్రభువు ఆశ్రమంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు అష్ట ప్రహరీ నామ యజ్ఞం, ఘృతయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జలయాత్ర నిర్వహించారు. బాహుదా నది జలాలను కలశాలతో తీసుకొచ్చి ఇళ్ల ముందు కుంభాలుగా ఏర్పాటుచేసి పూజలు చేశారు.

ఇచ్ఛాపురంలో కుంభ సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం:ఇచ్ఛాపురంలో స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కుంభ సంక్రమణం పూజలు మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి సింధూర మర్దన, పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక హోమాలతో పాటు సహస్రనామార్చనలు జరిపారు.

వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు



ధాన్యాదివాసం నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: సంతవురిటిలో ఆలయ ప్రతిష్ఠలో భాగంగా వేణు గోపాలస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, జలాదుద్దరణ, క్షీరాధివాసం, ధాన్యాదివాసం, మంగళాశాసనం, ఛాయాదివాసం పంచశయ్యాదివాసం, విశేషహోమాలు, స్నపనం జరిగాయి.

సామూహిక సూర్య నమస్కారాలు

గార: శ్వేత గిరిపై ఆలయ ప్రతిష్ఠ పురస్కరించుకుని మంగళవారం సామూహిక సూర్యనమస్కారాలు, మహిళలతో కుంకుమఅర్చనలు నిర్వహించారు. వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్ శర్మ, వసుంధర దంపతుల ఆధ్వర్యంలో విశేష హోమాలు, అయ్యప్ప, అభయ ఆంజనేయ స్వామి మంత్రజపాలు, సుందరకాండ పారాయణం, గణపతి దుర్గా పంచ, సూక్త, పంచ ఉపనిషత్ పారాయణం నిర్వహించారు.

ఫారంపాండ్లతో అంతరపంటలకు మేలు: ఏపీడీ

జి.సిగడాం: రైతులు పంటపొలాల్లో ఫారంపాండ్లు(నీటి గుంటలు) నిర్మించడం వల్ల అంతరపంటలకు మేలుఅని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేశ్, ఎంపీడీవో కె.రామకృష్ణం రాజులు తెలిపారు.పాలఖండ్యాం,సంతవురిటి రైతుల పంట పొలాల్లో నిర్మిస్తున్న ఫారంపాండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు పొలాల్లో వీటిని నిర్మించడం వల్ల వర్షంనీరు ఇంకడంతో అంతరపంటలకు ఒకటి, రెండుతడులు ఉపయోగించు కోవడానికి, పంట దిగుబడికి దోహదపడుతుందని తెలిపారు.మండలంలో 78 ఫారంపాండ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు.కార్యక్రమంలో ఏపీవో సత్యనారాయణ, ఈసీ పురుషోత్తమరావు, టీఏలు లక్ష్మణ, వెంటరమణ, ఎఫ్ఏ వి.రాంజీ పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్‌ఐ కుటుంబానికి చెక్ అందజేత

శ్రీకాకుళం క్రైం: ఇటీవల మృతిచెందిన ఏఆర్ ఎస్‌ఐ బెన్నయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన 75 వేల రూపాయల ఫండ్ చెక్కును మంగళవారం ఎస్పీ తన కార్యాలయంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ గోపినాథ్, ఏఓ శోభారాణి పాల్గొన్నారు.

50 ఏళ్లకు పింఛన్ ఇవ్వాలి

- యాదవ సంఘం జిల్లా కోకన్వీనర్ నాగళ్ల మురళీధర్



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మురళీధర్

ఆమదాలవలస: పశువుల కాపర్లగా, తప్పెటగుళ్ల కళాకారులుగా జీవనోపాధి పొందుతున్న యాదవులకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని యాదవ సంఘం జిల్లా కోకన్వీనర్ నాగళ్ల మురళీధర్ కోరారు. ఈమేరకు రాష్ట్రంలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించాలని ఆమదాలవలసలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా మంగళవారం మురళీధర్ విలేకరులతో మాట్లాడుతూ బీసీ-డిగా ఉన్న యాదవులను బీసీఏలోకి మార్చాలని కోరారు. అటవీజంతువుల దాడులతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రమాదాలు ఎదుర్కొంటున్న యాదవ కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

జేఈఈలో సూపర్-60 విద్యార్థుల ప్రతిభ

అరసవల్లి: శ్రీకాకుళం వైటీసీలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఐటీ సూపర్-60 విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. 30 మంది పరీక్షకు హాజరుకాగా 20 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని, వీరిలో ఆరుగురికి దేశంలోని ప్రముఖ ఎన్‌ఐటీ కళాశాలల్లో సీట్లు వస్తాయని కళాశాల కోర్సు డైరెక్టర్ మురళీబాబు తెలిపారు. ఐటీడీఏ పీవో కల్పనాకుమారి విద్యార్థులను అభినందిస్తున్నట్లు ఒకప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలోని సీతంపేటఐటీడీఏ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.కళాశాల బోధన సిబ్బందిని పీవో ప్రత్యేకంగా అభినందించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి: కలెక్టర్

కలెక్టరేట్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖపై సమీక్షలో భాగంగా వైద్యసేవలు, నెలవారీ లక్ష్యాలు, ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు ఆరోగ్యశ్రీ, మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సేవలు, వెల్‌నెస్‌కేంద్రాలు, 104,. 108 పనితీరు,ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం, పీహెచ్‌సీలో 14రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ, అసంక్రమిత వ్యాధులు, ఆయుష్మాన్ భారత్ సర్వే, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది సంఖ్య, ఖాళీల వివరాల వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్యకేంద్రాల్లో ఓపీసేవలు పెరగాలని,పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గర్భిణులకు స్కానింగ్, గైనకాలజి సేవలను ఉచితంగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సీపీశ్రీదేవి, డీపీఎంవో వెంకటలక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

అర్హత గల జర్నలిస్టులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాలను మంజూరుచేయనున్నట్లు కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. కలె క్టరేట్‌లో జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని చెప్పారు. విజయవాడలోని సమాచారపౌర సంబంధాల కమిషనర్ నుంచి ప్రాథమిక వెరిఫికేషన్ జరిగి జిల్లాకు 326 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు ఆర్డీవోలను ఆదేశించామని చెప్పారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్డీవో కార్యాలయ ప్రతినిధి పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి: ఈఆర్వో



మాట్లాడుతున్న సుదర్శన్‌దొర

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఈఆర్వో), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్‌దొర కోరారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిపాదనను జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ, టీడీపీ పట్టణాధ్యక్షులు ప్రకాష్‌రావుపట్నాయక్, కాళ్లధర్మారావు, జనసేన ప్రతినిధి రోకళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

సత్తాచాటిన కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల

- ఎనిమిది మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక



ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని అరసవిల్లి జంక్షన్‌లోగల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం డిగ్రీ చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థినులు క్యాంపస్ డ్రైవ్‌లో సత్తాచాటారని, రూ.7.25 లక్షల వార్షిక వేతనంతో ఇంటెల్లిపాట్‌కు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ టీఎస్. చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపికైన కళా శాల విద్యార్థినులు అభినందించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయడంలో కాకినాడఆదిత్య ముందుంటుందని తెలిపారు.ఎప్పటికప్పుడూ వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని శిక్షణఇస్తున్నామని చెప్పారు.విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో క్యాంపస్ కొలువులు, సెమిస్టర్‌లో కూడా ప్రథమ స్థానంలో ఉంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ప్లేస్‌మెంట్ అధికారి కిశోర్, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా అథ్లెటిక్స్ జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ జట్టు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నవరంగపూర్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు మంగళవారం పయనమయ్యింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు, ఇద్దరు టీమ్ మేనేజర్లు ఇ.అప్పన్న, గణేష్‌లు పాల్గొంటున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. జట్టుకు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొన్న మధుసూదనరావు క్రీడా కిట్లను అందజేశారు.● **ఇచ్ఛాపురం :** డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.జయలక్ష్మి, డి.విస్సు, టి.వినీతలు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 15 నుంచి జరగనున్న అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వజీర్ అహ్మద్ తెలిపారు. ఈసందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులను అభినందించారు.

18న జిల్లాస్థాయి కబడ్డీ క్రీడా జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈనెల 18న జిల్లాస్థాయి పురుషులు, సబ్ జూనియర్ బాలబాలికలు కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన రామలింగం నాయుడు కార్యదర్శి సాధు శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన పురుషులు మార్చి మూడు నుంచి విశాఖలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

29లోగా లైఫ్‌సర్టిఫికెట్లు అందించాలి

పొందూరు: రాష్ట్రప్రభుత్వ విశ్రాంతఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఈనెల 29లోగా సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అందించాలని విశ్రాంతఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.స్థానిక ట్రెజరీ కార్యాలయం పరిధిలో 810 మంది విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారులు ఉండగా 523మంది ధ్రువపత్రాలను సమర్పించారని తెలిపారు.మిగిలినవారు ప్రభుత్వం సూచించిన సమయంలోపత్రాలుకార్యాలయానికి అందించాలని సూచించారు.

సరోజినినాయుడుకు నివాళి

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర సమరయోధురాలు సరోజినినాయుడు జయంతి పురస్కరించుకుని మంగళవారం జాతీయమహిళా దినోత్సవాన్నినిర్వహించారు. ఈసందర్భంగా సరోజనినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చంద్రశేఖరరావు, సహాయకుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమయపాలనతోనే సత్ఫలితాలు

ఎచ్చెర్ల: సమయపాలన పాటించడంతోనే సత్ఫలితాలుసాధించగలమని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. ఎచ్చెర్లలోని వర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు మంగళవారం నిర్వహించిన స్వాగత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, హానరరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.

300 మంది రక్తదానం

అరసవల్లి: రక్తదానం చేయడానికి యువత ముందుకురావడం హర్షణీయమని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ విద్యాసంస్థల అనుబంధ గాయత్రి మేనేజ్‌మెంట్ కళాశాల నిర్వహించిన రక్తదాన శిబిరంలో 300 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళా శాల అధినేత స్వామినాయుడు, పులఖండం శ్రీనివాసరావు, రంగారావు పాల్గొన్నారు.

కబళించిన కిడ్నీవ్యాధి

- బాతుపురంలో యువకుడి మృతి

వజ్రపుకొత్తూరు: కిడ్నీ వ్యాధి ఓ యువకుడిని కబళించింది. బాతుపురం గ్రామానికి చెందిన చెల్లూరు అజయ్ (25) మంగళవారం సాయంత్రం కిడ్నీ వ్యాధితో మృతిచెందాడు. అజయ్ మూడేళ్ల క్రితం కిడ్నీవ్యాధి బారినపడ్డాడు. అప్పటి నుంచి మందులు వాడుతున్నట్లు గ్రామస్థులు చెప్పారు. వ్యాధి తీవ్రత పెరగడంతో ఏడాదిగా డయాలసిస్‌కూడా చేసుకుంటున్నాడు. అయితే పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో పది రోజులుగా చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందినట్లు స్థానిక సర్పంచ్ బత్తిని సృజన, నాయకులు లక్ష్మీనారాయణ చెప్పారు. చిన్నవయసులోనే కిడ్నీ మహమ్మారితో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు జోగారావు, నీలవేణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అజయ్‌మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధితోయువతి, యువకులు మృతి చెందుతుం డడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వందల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అయితే, కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలను ప్రభుత్వాలు వెలికితీయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

శ్రీకాకుళం క్రైమ్: ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక వాహన చోదకులకు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వరకు హెల్మెట్ ఆవశ్యకతపై వాహనచోదకులకుఅవగాహన కల్పించేందుకు మంగళవారం సాయంత్రం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అవతారం, శ్రీకాకుళం సీఐ సన్యాసినాయుడు, టూటౌన్ సీఐ జి.మోహనరావు, ఎస్‌ఐలు, విద్యార్థులు, నేషనల్ యూత్ ఫౌండేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మరణించిన ఓటర్లను తొలగించండి

రణస్థలం:జాబితాను పరిశీలించి మరణించిన ఓటర్లను తొలగించాలని తహసీల్దార్ రామారావు కోరారు. మంగళవారం రణస్థలంలో 87మంది బూత్‌లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డబుల్ ఎంట్రీలు తొలగించాలని, పోలింగ్‌కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

అరసవల్లి: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయసేవా సదన్‌లో ఎంపీఆర్ లా కాలేజీ, అంబేద్కర్ యూనివర్శిటీలోని లా విద్యార్థులకు న్యాయఅవగాహన సదస్సునునిర్వహించారు. ఈసందర్భంగా జనన, మరణ ధ్రువపత్రం, పెళ్లి,ఆస్తుల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధరరావు ట్రాఫిక్ నిబంధనలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా పంచాయతీఅధికారి వేంకటేశ్వరరావు ధ్రువపత్రాల జారీపై న్యాయవిద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, సబ్ రిజిస్ట్రార్ రవికుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సన్యాసినాయుడు